ప్రజాశక్తి
బుధవారం 4 డిసెంబర్ 2024 | 5 | విజయనగరం



జాతీయ వాలీబాల్ జట్టుకు విజయలక్ష్మి ఎంపిక


ప్రజాశక్తి-విజయనగరం టౌన్



జిల్లా వాలీబాల్ క్రీడాకారిణి ఎం.విజయలక్ష్మి, భారత జూనియర్ వాలీబాల్ జట్టుకు ఎంపికైంది. విజయలక్ష్మి ఇప్పటివరకు 16, 17, 19సంవత్సరాల లోపు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం విశాఖపట్నంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్ లో శిక్షణ తీసుకుంటోంది. జాతీయ పోటీలకు ఎంపికైన విజయలక్ష్మికి రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షులు పిజి విజర్ నాయుడు (గన్నబాబు), జిల్లా అధ్యక్షులు సూరిబాబు, కార్యదర్శి కెవిఎన్ రాజు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు, స్పోర్ట్స్ హాస్టల్ కోచ్ సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

మళ్లీ విద్యుత్తు ఛార్జీల బాదుడు

- నిన్న ట్రూఅప్.. నేడు సర్దుబాటు ఛార్జీలు
- జిల్లా వినియోగదారులపై రూ.300కోట్లు భారం
- రెండేళ్లపాటు వసూలు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల భారంతో ఇబ్బంది పడుతున్న విద్యుత్తు వినియోగదారులపై మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విద్యుత్తు సర్దుపోటు పేరిట ఛార్జీల భారాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ట్రూ అప్‌ఛార్జీలతోపాటు రెండు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్టుమెంట్ (ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలతో ప్రజల నడ్డివిరుస్తున్న విద్యుత్తు సంస్థలకు తాజాగా మరో భారాన్ని మోపేందుకు విద్యుత్తు నియంత్రణ మండలి అనుమతి ఇచ్చింది. రెండేళ్లపాటు విద్యుత్తు వినియోగ బిల్లులతో ఈ ఛార్జీలు పడనున్నాయి. వచ్చే జనవరి నెల నుంచి అమలు కానున్న ఈ ఛార్జీలు రెండేళ్లపాటు అమలవుతాయి.

అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలను పెంచబోమని ప్రజాగళం సభల్లో ఊదరగొట్టిన సిఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా సర్దుబాటు పేరుతో ఛార్జీల పెంపునకు రెండో సారి పచ్చజెండా ఊపారు. నవంబరులో వినియోగించుకున్న విద్యుత్‌కు ట్రూ అప్‌ఛార్జీల పేరిట డిసెంబరు 2 నుంచి జారీ అయ్యే బిల్లుల్లో ఛార్జీల పెరుగుదల కనిపించడంతో వినియోగదారులు అవాక్కవుతున్నారు. ఈ ఛార్జీల భారం జిల్లాలో రూ.267కోట్లు కాగా, తాజా పెంచిన ఛార్జీలతో మరో రూ.300కోట్లు భారం పడనుంది.

జిల్లాలో 9,64,006మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. రెండో విడత పెంచిన ఛార్జీలు జనవరి బిల్లులతో కలిపి రానున్నాయి. యూనిట్‌కు రూ.92 పైసలు చొప్పున డిసెంబరు నుంచి 2026 నవంబరు వరకు రెండేళ్ల పాటు అదనంగా ఈ సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయనున్నారు.ఒక్కో వినియోగదారుడి పై సగటున నెలకు 300 నుంచి రూ.500 వరకు భారం పడనుంది. ఈ లెక్కన జిల్లాపై సుమారు రూ.300 కోట్లు వరకు భారం పడనుంది.

అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచే ప్రసక్తే లేదని చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపనున్నారు. వైసిపి హయంలో ట్రూ అప్‌ఛార్జీలతో పాటు అదనపు సర్దుబాటు ఛార్జీల వసూలును 'బాదుడే బాదుడు' అంటూ ఊరూవాడ అప్పటి ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేసిన కూటమి నాయకులు ఇప్పుడు మళ్లీ వైసిపి బాటలోనే పయనిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం కారణంగా మరో రెండేళ్ల పాటు ప్రజలకు విద్యుత్ భారాలు తప్పవు.

విద్యుత్తు భారాలపై సిపిఎం నిరసనలు

- పలుచోట్లరాస్తారోకోలు
- పెంచిన ఛార్జీలు ఉపసంహరించకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ట్రూ అప్ ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకోలు చేశారు. లేకుంటే 2000 సంవత్సరంలో జరిగిన బషీర్‌బాగ్ ఉద్యమం మళ్లీ తప్పదని నాయకులు హెచ్చరించారు. విద్యుత్తు ఛార్జీల భారాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై వెయ్యబోమని చెప్పి నేడు రెండు దఫాలుగా విద్యుత్ భారాలు రాష్ట్ర ప్రభుత్వం వేయడం అన్యాయమన్నారు. చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, కె.సురేష్, సిహెచ్ వెంకటేష్, యు. ఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా విశాఖ అరకు రహదారిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా,రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మద్దిల రమణ మాట్లాడుతూ పెంచిన ట్రూ ఆప్, సర్దుబాటు, సర్ ఛార్జీలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెలికాని



ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం కార్యకర్తలు, ప్రజలు



విజయనగరం : ఆర్‌టిసి కాంప్లెక్సు జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ముత్యాలు, కే.రమేష్, వెంకటరావు, సింహ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలి

బొబ్బిలి : రాష్ట్ర ప్రజలపై టిడిపి కూటమి ప్రభుత్వం విధించిన ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సింగారపువీధిలో ప్రచారం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారం వేయబోమని చెప్పి నేడు సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జయమ్మ, కళావతి, సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : వామపక్షాల ఆధ్వర్యాన విద్యుత్తు ఛార్జీల పెంపుదలకు నిరసనగా స్థానిక సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, వామ పక్ష నాయకులు మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్తు ఛార్జీలు పెంపునకు ఇఆర్‌సి పేరిట 15,484 కోట్ల రూపాయలు భారం మోపడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొత్స నారాయణ, తుమ్మ తాత, తుమ్మ మురళి, మన్యపురి సన్యాసి రావు, బొంతు అప్పలనాయుడు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో టెక్ పాలీ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



ఈ నెల 6,7 తేదీల్లో స్థానిక పూల్‌బాగ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా టెక్ పాలీ ఫెస్ట్ జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఫెస్ట్ నిర్వహణపై తమ ఛాంబర్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఫెస్ట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 3 ప్రభుత్వ, 14 ప్రయివేట్ పాలిటెక్నికల్ కళాశాలలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు ఇది జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని చెప్పారు. గ్రౌండ్ చదును చేయడం, శానిటేషన్, తాగునీటి సదుపాయాన్ని మున్సిపాల్టీ కల్పించాలని చెప్పారు. రెండు రోజులూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఈ ఫెస్ట్‌ను తిలకించేందుకు 6వ తేదీన పాఠశాల విద్యార్థులు, 7న కళాశాల విద్యార్థులు వచ్చేలా చూడాలని డిఇఒ, ఆర్‌ఐఒలను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిఇఒ యు.మాణిక్యంనాయుడు, ఎపిఈపిడిసిఎల్ ఎస్‌ఈ లక్ష్మణరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కె.రాణి, డిఎస్‌పి ఎం.శ్రీనివాస్, సిఐ శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైబల్ యూనివర్శిటీ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయగనరంకోట

గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. యూనివర్సిటీ పనులపై తమ ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. విద్యుత్ సమస్యలపై చర్చించారు. నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసన్, ఎఒ డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ లక్ష్మణరావు, జెన్‌కో ఎస్‌ఇ కె.నర్సింహరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పత్తిరైతుల ఇబ్బందులపై

వాస్తవాలను అంగీకరించిన అధికారులు

- కొనుగోలు చేసింది 38 మంది రైతుల నుంచే
- రాజాం కొనుగోలు కేంద్రానికి ఖరారు కాని టెండర్
- యోచన దశలోనే భామిని కేంద్రం
- ఇదే అదునుగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు

పత్తి రైతుకు ఇ-క్రాప్ చిక్కులు!


- కొనుగోలుకు నిరాకరిస్తున్న అధికారులు
- ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి
- ఎకరాకు రూ.6 వేలు నష్టం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో పత్తి రైతుల కష్ట, నష్టాలను అధికార యంత్రాంగం అంగీకరించింది. ఇప్పటి వరకు ఒకే ఒక్క కొనుగోలు కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేశామని, రాజాంలో తలపెట్టిన కొనుగోలు కేంద్రానికి ఇంకా రవాణా టెండర్ కూడా ఖరారు కాలేదని, భామినిలో ఏర్పాటు చేస్తామన్నది ఇంకా యోచన దశలోనే ఉందని స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలో 1147 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసినట్టు కూడా ఒప్పేసుకున్నారు. ఇవన్నీ ప్రజాశక్తి కథనాల్లో వెలువడిన అంశాలే కావడం విశేషం. ఇళ్ల వద్ద 'కూర్చొని ఇ-క్రాప్ నమోదు', 'పత్తిరైతుకు ఇ-క్రాప్ చిక్కులు', 'ఇలాగేనా పత్తి రైతుల్ని ఆదుకునేది' అంటూ గత నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. వీటిపై విజయనగరం జిల్లా ట్రేడ్ అండ్ మార్కెటింగ్ శాఖ అధికారి బి.రవికిరణ్ ప్రతిస్పందించారు. ఈ మేరకు ఒక లిఖిత పూర్వక సమాచారాన్ని జిల్లా సమాచార శాఖ అధికారి ద్వారా ప్రజాశక్తికి పంపారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఒకే ఒక్క పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, అది రామభద్రపురం మండలం ముచ్చర్లవలసలోని పత్తి జిన్నింగ్ మిల్లుగా నోటిఫై చేశారని ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చింది. మార్కెటింగ్ శాఖ దీన్ని అంగీకరిన్నాతే


ఇళ్ల దగ్గర కూర్చొని ఇ-క్రాప్ లెక్కలు
- పత్తికి బదులు వరి నమోదు
- ఎలిజిబిలిటీ సాకుతో కొనుగోలు నిరాకరిస్తున్న సిసిఐ
- వ్యవసాయ శాఖ నిర్వాకంతో నిండా మునిగిపోయిన రైతులు

రామభద్రపురం మండలంలో సిసిఐ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రామభద్రపురం, బాడంగి, బొబ్బిలి, తెర్లాం మండలాల్లోని రైతులు పత్తి విక్రయించుకునేందుకు అనుమతించినట్లు పేర్కొన్నారు. ఇది కూడా సాలూరులో ఏర్పాటు చేయాల్సింది ఇక్కడికి తరలించినట్టు చెప్పడం గమనార్హం. పలుచోట్ల ఏర్పాటు చేస్తామన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ప్రజాశక్తి ఎత్తిచూపింది. రాజాంలో ఇంకా రవాణా టెండర్లు ఖరారు కాకపోవడం వల్ల నోటిఫై చేయలేదని, మన్యం జిల్లా భామిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు యోచనలోనే ఉందని తెలిపారు. కథనం రాసిన నాటికి 137 మంది రైతుల వద్ద 1140 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్టు నిర్ధారించారు. ఈ రెండు రోజుల కాల వ్యవధిలో మరో రైతు వద్ద నుంచి 7క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఈలెక్కన 38మంది రైతుల నుంచి 1147 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్టు అధికారులు ప్రజాశక్తికి సమాచారం ఇచ్చారు. పత్తి కనీస మద్దతు ధర క్వింటా రూ.7,521 చొప్పున ప్రభుత్వం నిర్ధేశించగా ఇ-క్రాప్ నమోదు కాకపోవడం, వచ్చిన దిగుబడి కూడా పూర్తిస్థాయిలో తీసుకోకపోవడం, తగినన్ని కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల రైతులు రూ.6,300కే విక్రయించు కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజాశక్తి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన మార్కెటింగ్ శాఖ రూ.7,521 కన్నా తక్కువకు విక్రయించవద్దని ఉచిత సలహా ఇచ్చింది. రైతుల సంక్షేమం కోసం సిసిఐ నిబంధనల ప్రకారం వివిధ ప్రాంతాల్లో గుర్తించిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు. 98శాతం పత్తి పంట ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ప్రతి స్పందనలో పేర్కొన్నారు. బహుశా రచ్చకెక్కుతున్న రైతుల ఇబ్బందులన్నీ మిగిలిన 2శాతంలో ఉన్నట్టుగా వ్యవసాయ శాఖ లెక్కిస్తుంది.



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్య శాఖ సిబ్బంది

పెద బూరాడపేటలో 150 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పెద బూరాడపేటలో మంగళవారం అనారోగ్యంతో 150 గొర్రెలు మృతి చెందాయి. ఆ గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందార్లు డొప్ప త్రినాధ్, కర్రి సూర్య నారాయణకు చెందిన గొర్రెలను గత రెండు రోజులుగా పోలాల్లోకి మేతకు తీసుకు వెళ్లగా అక్కడ రాలిపోయిన వరి కంకులు తిని, జీర్ణం కాక అనారోగ్యానికి గురై ఒక్క సరిగా కుప్పకూలి మృతి చెందాయని బాధితులు చెబుతున్నారు. మృతి చెందిన గొర్రెలు 10లక్షలకు పైగా విలువ ఉంటాయని అంచనా వేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గొర్రెల పెంపకం దార్లను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

పెద బూరాడపేట గొర్రెల పెంపకందార్లను ప్రభుత్వం ఆదుకొంటుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మంగళవారం ఆమె పెద బూరాడ పేటలో గొర్రెల పెంపకం దార్లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొర్రెలు మేత తిని మృతి చెందడం బాదాకరమన్నారు. వెటర్నరీ అధికారుల నుంచి మృతి గల కారణాలు తెలుసుకొని నష్టపోయిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

వాష్‌పై శిక్షణ

విజయనగరం కోట : పరిసరాల పరిశుభ్రత , వ్యక్తిగత శుభ్రత, పారిశుధ్యం, నీటి సరఫరా వ్యవస్థ అమలు, ఆరోగ్యకరమైన అలవాట్లు తదితర అంశాలు (వాష్) పై శిక్షణా కార్యక్రమం ఏరియా కో ఆర్డినేటర్లకు, ఎపిఎంలకు, సిసిలకు మంగళవారం నిర్వహించారు. ఇందులో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, ఎపిడి కె.సావిత్రి, హెచ్‌డి యాంకర్ పర్సన్ కె.గీత, సిడిపిఒ ప్రసన్న, జెజెఎం జిల్లా కో ఆర్డినేటర్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ టౌన్‌షిప్ ఇళ్ల స్థలాల కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్‌టిఆర్ టౌన్‌షిప్ (ఎంఐజి లేఅవుట్) లో లాటరీ ద్వారా విఎంఆర్‌డిఎ ఇళ్ల స్థలాలను కేటాయించింది. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం విఎంఆర్‌డిఎ అధికారులు ఈ లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రఘుమండ లేఔట్ లో మిగిలిపోయిన ఎంఐజి-1 ఏడు ప్లాట్లను, జియ్యన్నవలస లేఅవుట్ లో ఎంఐజి -1 ప్లాట్లు 25, ఎమ్ఐజి-2 ప్లాట్లు 4, ఎంఐజి-3 ప్లాట్లు 11, మొత్తం 47 ప్లాట్ లకు లాటరీ పూర్తి చేశారు. ఐదో విడత చేపట్టిన ఈ లాటరీ ప్రక్రియ ద్వారా ఈ రెండు లేఅవుట్లలో ఇళ్ల స్థలాల కేటాయింపు పూర్తయింది. లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలను గెలుపొందిన విజేతలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ప్లాట్ల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడా లేఅవుట్లలో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో గంజాయి, మద్యం, నాటుసారా, పశువుల అక్రమ రవాణను నియంత్రించడంలో భాగంగా ఆకస్మిక వాహన తనిఖీలను నిరంతర ప్రక్రియగా చేపడుతున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లాలో పలు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనదారులకు, ప్రజలకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఇర్రెగ్యులర్ నంబరు ప్లేట్స్ కలిగిన వారిపై 280 కేసులు, యూనిఫాం లేకుండా వాహనాలు నడిపిన వారిపై 520 కేసులు, హెల్మెట్స్ ధరించని వారిపై 7020 కేసులు, సిగ్నల్స్ అతిక్రమించిన వారిపై 570 కేసులు, వాహన రికార్డులు లేని వారిపై 70 కేసులు, ప్రమాదకరంగా వాహనాలను నడిపిన వారిపై 209 కేసులు, అతి వేగంగా వాహనాలు నడిపిన వారిపై 24 కేసులు, సెల్ ఫోను మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారిపై 220 కేసులు, ప్రమాదకరంగా వాహనాలను పార్కింగు చేసిన వారిపై 172 కేసులను గత 10 నెలల్లో నమోదు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమనికమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా సూక్ష్మ,చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు,వ్యాపార ఔత్సాహిక సర్వే (ఎంఎస్ ఎంఇ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు టిపిఆర్ఒ సింహాచలం, మెప్మా సిబ్బంది, ఎమినిటీస్, వెల్ఫేర్, శానిటేషన్ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి ప్రతి ఇంటిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంతమంది ఉన్నారు, ఏ ఏవిధంగా పరిశ్రమలు, నడుపుతున్నారు, ఎటువంటి వ్యాపారాలు సాగిస్తున్నారు వంటి వివరాలపై సర్వే చేస్తున్నారు. సర్వే డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

మార్చి లోపు పన్ను బకాయిలు చెల్లిస్తే 2 శాతం రిబెట్

2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండవ అర్థ సంవత్సరానికి సంబంధించి 2024 అక్టోబర్ నుండి 2025 మార్చి వరకు ఉన్న పన్ను బకాయిలను తక్షణమే చెల్లిస్తే 2 శాతం వడ్డీ విధింపు నుండి వెసులుబాటు ఉంటుందని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రెండవ అర్థ సంవత్సరానికి సంబంధించిన పన్ను బకాయిలను డిసెంబర్ 31 లోపు చెల్లిస్తే 2 శాతం వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు. జనవరి 1 నుండి 2 శాతం అపరాధ రుసుము వసూలు చేస్తామని తెలిపారపు. అడ్మిన్ కార్యదర్శులు ఖాళీ స్థలాల పన్నులను విధించడంతోపాటు డిమాండ్ పెంచాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

పనులు జరుగుతున్న సమయంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించే విధంగా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కొత్తపేట, ధర్మపురి, హనుమాన్ నగర్ ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రహదారులు, కాలువల నిర్మాణాన్ని పరిశీలించారు. వాటర్ ట్యాంకు చుట్టుపక్కల చెత్తాచెదారాలు ఉండడంతో సంబంధిత కార్యదర్శులను మందలించారు.

గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

గుంతలు రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నామని కమిషనర్ నల్లనయ్య పేర్కొన్నారు. గుంతలు ఉన్న ప్రాంతాలను, వాటి మరమ్మత్తు పనులను ఇఇ టి.రాయిల్ బాబు మంగళవారం పరిశీలించారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం తొలగింపు

నిబంధనలకు విరుద్ధంగా దాసన్నపేట ప్రాంతంలో నిర్మించిన భవన నిర్మాణంలో కొంత భాగాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. ఇటీవల ఈ భవనంలో అక్రమ నిర్మాణం తెలిసిన వెంటనే కమిషనర్ తక్షణం స్పందించారు. మరో భవనంలో కూడా అనుమతులు లేకుండా పై అంతస్తు వేయడంతో వాటికి అమర్చిన సెంట్రింగ్ పనులను సిబ్బంది అడ్డుకున్నారు.

అయ్యప్ప భక్తుల బస్సు అగ్నికి ఆహుతి

- డ్రైవర్ అప్రమత్తంతో సురక్షితంగా బయట పడ్డ యాత్రికులు
- నగదు, బట్టలు, లగేజి దగ్ధం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని మజ్జిరాముడుపేట, దేవుదల గ్రామాల నుంచి శబరిమలైకు ప్రైవేట్ ట్రావెల్‌తో వెళ్లిన అయ్యప్ప భక్తుల బస్సు తమిళనాడు సమీపంలో కంచి వద్ద మంగళవారం అగ్నికి ఆహుతైంది. మజ్జిరాముడుపేట గ్రామం నుంచి 41 మంది అయ్యప్ప భక్తులతో నవంబర్ 25న శబరిమలైకి వెళ్లిన ప్రైవేట్ ఏసి బస్సు శబరిమల దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా కంచి సమీపంలో భోజనంకు బస్సు ఆపి, పక్కన వంట చేసుకుంటుండగా బస్సులో మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. అందరూ బయట ఉండటంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే బస్సులో ఉన్న నగదు, బట్టలు, లగేజీ కాలిపోయాయి. హైవే కావడంతో పోలీసులు అప్రమత్తమై ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. తక్షణమే సంఘటన



దగ్ధమవుతున్న బస్సు

స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ప్రైవేట్ ట్రావెల్ యాజమాన్యం కంచి నుంచి వేరే బస్సులో యాత్రికలను స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది.

4న ఎస్‌ఆర్ షాపింగ్ మాల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఎంజి రోడ్డులోగల ఎస్‌ఆర్ షాపింగ్‌మాల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 4న జరుగుతుందని షాపింగ్ మాల్ డైరెక్టర్ కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ సినీ హీరో కిరణ్ అబ్బవరం చేతుల మీదుగా ఒక వేడుకగా అంగరంగ వైభవంగా జరుపుతామని తెలిపారు. వార్షికోత్సవ వేడుకలలో అన్ లిమిటెడ్ ఆఫర్సు తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఫిరోజ్ ఖాన్ ఏరియా మేనేజర్, ఎ.సూర్య కుమార్, బ్రాంచి మేనేజర్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

జామి : రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కె.విజయ గౌరిని గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. విద్యార్థి దశ నుంచి విద్యారంగం కోసం పోరాటాలు చేసి ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యమాలు చేసిన తీరు క్లస్టర్ పాఠశాలలను రద్దు చేయడం కోసం, ప్రాథమిక పాఠశాల విలీనాన్ని రద్దుకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలోనూ కృషి చేశారని గుర్తు చేశారు. ఆమెను ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ప్రభుత్వ విద్యారంగం మరింత బలోపేతం కావడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విజయ గౌరి బయోడేటాను జామిలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిబిఆర్కే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజారావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి వాసుదేవరావు, ఎం తాత నాయుడు, మండల ట్రెజరర్ బి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు పి సూర్యారావు, ఎస్ ముత్యాలు, జి ప్రసాద్, ఏ జనార్దన్‌రావు, పైడినాయుడు, మురళి, వి రాజు పాల్గొన్నారు.

ఆయుష్‌పై ఆశాలకు అవగాహన

పూసపాటిరేగ: ఆయుష్ వైద్య విధానంపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నామని పూసపాటిరేగ హోమియో వైద్యులు డాక్టర్ వెల్లస్కీ తెజా అన్నారు. జాతీయ ఆయుష్ మిషన్, ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రెల్లివలస పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఆయుష్ సేవల గురించి ఆశాలకు వివరించారు. పూసపాటిరేగ పిహెచ్‌సిలో హోమియో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశాలతో పాటు వైద్యులు భాగ్యరేఖ, రాజ్ కుమార్, వైద్య సిబ్బంది వర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మోనటరింగ్ బృందం పాఠశాల సందర్శన

గజపతినగరం: మండలంలోని పలు పాఠశాలలను జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ బృందం అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ బృందంలో డైట్ వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణ, డైట్ లెక్చరర్ పి. రవికుమార్, సమగ్ర శిక్ష బి.ప్రసాద్ రావు ఉన్నారు. ముందుగా మరుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ, కెజిబివి పాఠశాలలను, పురిటిపెంటలోని ఎంపిపి (ఎస్) రెగ్యులర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్. విమలమ్మ, బి.సాయి చక్రధర్, సిఆర్పిలు పాల్గొన్నారు.

అనుమతుల్లేని కోళ్ల ఫారానికి నోటీసులు

శృంగవరపుకోట: రామన్న పాలెం కోళ్ల ఫారానికి అనుమతులు లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. గ్రామానికి ఆనుకొని కోళ్ల ఫారం ఏర్పాటు చేయడంపై సిపిఎం ఆధ్వర్యంలో రామస్వపాలెం గ్రామస్తులు సోమవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించడంతో మంగళవారం కోళ్ల ఫారం యజమానికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై కిల్తంపాలెం సెక్రెటరీ శంకర్రావు మాట్లాడుతూ రామస్వపాలెం గ్రామంలో బర్రెకొట్టె కృష్ణవేణి ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ విధమైన అనుమతులు లేకుండా రేకుల షెడ్డులు నిర్మాణం చేసి కోళ్ల ఫారం నడుపుతున్నారని దీంతో విచారించి వెంటనే తొలగించాలని నోటీసులిచ్చామని తెలిపారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి స్థలాన్ని కేటాయించండి

శృంగవరపుకోట: ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, సామాజిక భవనం నిర్మాణానికి పట్టణంలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని కలసి ఎస్‌కోట ఆర్యవైశ్య ప్రతినిధులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్‌కోట పట్టణంలోని శివాలయం ప్రాంగణంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథిల పరిస్థితికి చేరుకుందని, ఆ వసతి గృహాన్ని పుణ్యగిరి రోడ్డులో నిర్మించారని, ఖాళీ అయిన ఆ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ స్థలాన్ని తమకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు సాయిరాం (అప్పలరాజు), క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, చక్క శిరిక్, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

చీపురుపల్లి: ఇటీవల మృతి చెందిన కింతలి శ్రీరాములు కుటుంబానికి దుర్గామల్లేశ్వర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ముల్లు రమణ, కుమరాం సర్పంచ్ ముల్లు రమాదేవిలు ఆర్థిక సాయం అందించారు. మృతుని భార్య పార్వతికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున్న ఏడాది పాటు ప్రతీ నెల ఆర్థిక సాయాన్ని అందించేందుకు ముల్లు రమణ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు తన కుటుంబం ముందుంటుందన్నారు. కాగా గతంలో కూడా దుర్గామల్లేశ్వర సేవా ట్రస్ట్ ద్వారా పలువురికి ఆర్థిక సాయాన్ని రమణ కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై లక్షణ, బూరెలు శ్రీను, నిదాన పైడ్రాజు, మీసాల రామానాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు డీలర్లపై 6-ఎ కేసులు నమోదు

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేశామని సిఎస్‌డిటి మురళీకృష్ణ తెలిపారు. ప్రజలకు పంపిణీ చేసి వాహనం ద్వారా సోమవారం రాత్రి 32 బస్తాలను 12వ డిపో డీలర్ స్వర్ణ ఇంటి నుంచి కొంగవానిపాలెం గ్రామం తరలించినట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఉదయం స్థానిక సిఎస్‌డిటితో పాటు రాజాం మండలానికి చెందిన సిఎస్‌డిటి చిరంజీవులు డిపోను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. నాలుగున్నర క్వింటాలు బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. 13వ నెంబర్ డిపోను కూడా తనిఖీ చేశామని ఇక్కడ 12 క్వింటాలు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. కందిపప్పు, పంచదార నిర్ణయించిన ధర కంటే మూడు రూపాయలు అధికంగా అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ రెండు డిపోలపై కేసు నమోదు చేసి సరుకులను విఆర్ఒకు అప్పజెప్పామన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

బొబ్బిలి: స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బాడంగి మండలం భీమవరం గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్(23) మంగళవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇతను కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. యువకుడు తల్లి, అన్నయ్య జీవనోపాధి కోసం గుంటూరు జిల్లాలకు వలస వెళ్లినట్లు స్థానికులు చెపుతున్నారు. చంద్రశేఖర్ ఆత్మహత్యపై కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు.

జల వనరులశాఖ అధికారులు పరుగులు

● నాగావళి నది నీటి చౌర్యంపై తనిఖీలు ● షుగర్స్ యాజమాన్యంతో చేతులు కలిపిన జెఇ ● విందు, వినోదాలు ఏర్పాటుతో తూతూ మంత్రంగానే విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ కర్మాగారం యాజమాన్యం నాగావళి నది నుంచి అక్రమంగా నీటి చౌర్యం చేస్తున్న కథనం ప్రజాశక్తిలో వెలువడటంతో స్పందించిన జల వనరుల శాఖ అధికారులు మంగళవారం నాగావళి నదికి పరుగులు తీశారు. ఈ మేరకు డిఇ వై.గణిరాజు, జెఇ శంకరరావు, జి. కార్తీక్‌లు నాగావళి నది నుంచి కర్మాగారానికి నీరు వెళ్తున్న పంపు షెడ్డును పరిశీలించారు. ఈ పరిశీలన తూతూ మంత్రంగానే జరిగింది. కర్మాగారం యాజమాన్యం నుంచి వీరబాబు, మరికొందరు వీరితో రావడం జల వనరుల శాఖ అధికారులు అనుకూలంగా మాట్లాడడంతో వీరి దర్యాప్తు తూతూ మంత్రంగానే జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడికి వెళ్లిన ప్రజాశక్తి విలేకరి నీటి చౌర్యంపై ప్రశ్నిస్తే అధికారుల నుంచి పొంతన లేని సమాధానం రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. వార్త రాసే ముందు తమకు తెలియజేస్తే మాట్లాడే వారమని సమాధానం ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. నీటి చౌర్యంపై విచారణ జరపకుండానే 2024 వరకు నీటి అనుమతులు ఉన్నాయని చెప్పారు. అనుమతులు అక్కడ కాదని నీటి చౌర్యం ఉన్నాయా.? ఫ్లో మీటర్ రక్షణ ఏర్పాటు ఉందా.? రోజువారి ఎన్ని గంటలు నీటిని సరఫరా చేస్తున్నారు.? ఇతర సమస్యలు అడిగితే వాటికి సమాధానం దాటవేశారు. ఇంకా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయలేదని సమాధానం ఇచ్చారు. పంపు షెడ్ వద్ద ఉన్న రన్నింగ్ ఫ్లో మీటర్ పైపులైన్లు పరిశీలించినట్లు తెలిపారు. ఈ దర్యాప్తు పూర్తిస్థాయిలో జరపకపోవడంతో షుగర్ యాజమాన్యంతో కుమ్మక్కు అయినట్లు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదుదారుడు సంకిలి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మజ్జి రాముడు పేట మాజీ సర్పంచ్ శ్రీనివాస రావుకు ముందుగా వస్తున్నట్లు సమాచారం ఇవ్వకుండా దర్యాప్తు చేయడం ఎంతవరకు సమంజసమని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికలు ఉన్నత అధికారులకు అందజేస్తామని హేళనగా జెఇ శంకర్రావు బదులిచ్చారు. ఫిర్యాదుదారులు శ్రీనివాసరావు, పట్టాభి ఇద్దరు నీటి చౌర్యంపై సరైన నివేదికలు ఇవ్వకుంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జల వనరుల శాఖ మంత్రి స్థాయి వరకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



ఫ్యాక్టరీ యాజమాన్య సిబ్బందితో కలిసి ఉన్న అధికారులు

విచారణ అధికారులకు యాజమాన్యం విందు?

సంకిలి నాగావళి నది నుంచి ప్యారి సుగర్స్‌కు అనుమతులకు మించి నీటి చౌర్యం చేయడం పట్ల సంకిలి సర్పంచ్ పట్టాభి, మెజార్టీ పాలకవర్గ సభ్యులు ఎంఆర్‌పేట మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ప్రజాశక్తిలో ప్రచురించిన కథనం, ఫిర్యాదులుకి స్పందించిన ఇరిగేషన్ డిఇ గణిరాజు, జెఇ శంకర్రావు, కార్తీక్‌లు పరిశీలనకు వచ్చారు. తూతూ మంత్రంగానే పరిశీలించారు. పరిశీలన అనంతరం షుగర్స్ యాజమాన్యం గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విందు, కనువిందులో పాల్గొన్నారు. వాస్తవంగా ప్రజాశక్తిలో వచ్చిన కథనాలు ఫిర్యాదులుపై జల వనరుల శాఖ అధికారులు విచారణ జరిపి వెళ్లాలే తప్ప సుగర్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన విందులో పాల్గొనడం చట్టరీత్యా విరుద్ధం. విచారణ అధికారులు విందు కనువిందులో పాల్గొనడంతో సుగర్స్ యాజమాన్యంతో కుమ్మక్క అయినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విచారణ పూర్తిస్థాయిలో జరగలేదని ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఎంవిజిఆర్‌లో ఆన్‌లైన్ పిడిపి ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

చింతలవలస సమీపంలోని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళ వారం 'ఇన్నోవేటివ్ గ్రీన్ ఎనర్జీ జెనరేషన్, స్టోరేజ్ టెక్నాలజీస్' పై ఆన్‌లైన్ పిడిపి ప్రారంభ మైంది. ఇందులో భాగంగా ఆరు రోజులు పాటు ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (పిడిఎఫ్) నిర్వహిస్తామని పిడిఎఫ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం. శివ సుబ్రమణ్యం తెలిపారు. సాంకేతికతలు, వినూత్న నిల్వ పరిష్కారాలలో అధ్యాపకులకు, పరిశోధకులకు, పీజీ విద్యార్థులకు, పరిశ్రమ నిపుణులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.రవికుమార్ పాల్గొన్న హరిత శక్తి సాంకేతికతల భవిష్యత్తు ప్రభావాన్ని వివరించారు. తిరుపతి ఐఐటి నుంచి వచ్చిన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అండ్ డీన్ స్పాన్సర్డ్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ ప్రొఫెసర్ ఇ. అనిల్ కుమార్ సౌర శక్తి, హైడ్రోజన్ నిల్వ, బ్యాటరీ టెక్నాలజీ, ఫ్యూయల్ సెల్ టెక్నాలజీలలో తాజా అభివృద్ధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రమేష్, 200 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు

ప్రజాశక్తి- డెంకాడ

ఫెంగల్ తుపాను కారణంగా వరిచేలు తడిచి పోయిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు తెలిపారు. మండలంలోని పినతాడివాడలో తడిచిన వరి చేలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిన తరువాత పూర్తిగా ఆరని పనలను తుపాను నేపథ్యంలో కుప్పలు వేసినప్పుడు ఎకరాకు 25 కిలోల గల్లు ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పవేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు అన్నారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఉప్పు ద్రావణాన్ని (ప్రతి లీటర్ నీటికి 50 గ్రాముల చొప్పున గల్లు ఉప్పు కలుపుకోవాలి) పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలన్నారు. ఒక వేల పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలన్నారు. కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలని, నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకత్తడమే గాక రంగు మారి చెడు వాసన వస్తుందని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని వివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి దాన్యం పోగు పెట్టడం వల్ల మొలకత్తకుండా, చెడిపోకుండా ఉంటాయని వివరించారు. వెన్ను దశలో వెన్ను బరువు వల్ల పడిపోయిన వరిని వీలైనంత తొందరగా దుబ్బులుగా లేపి నిలబెట్టి కట్టలుగా కట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, ఎఒ పి.నిర్మల, గ్రామ సహాయకులు ఆర్.కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.



డెంకాడ: తడిచిన వరి కుప్పలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తవలస: తుపాను ప్రభావం వల్ల రైతులకు పంట నష్టం జరగకుండా తుగ జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ కె. మాధురి శరణ్య తెలిపారు. మండలంలోని దేశపాత్రునిపాలెంలో గల వరి పొలాలను ఆమె మంగళవారం సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కుప్పల్లో ఉన్న ధాన్యం తడిసినట్లయితే ఎకరాకు 25కిలోల ఉప్పును చల్లాలని తద్వారా మొలక రాకుండా ఉంటుందని చెప్పారు. మండలంలో 2058 ఎకరాలు వరి పంట వేయగా 900ఎకరాలు వరి కోత కోశారని, 875ఎకరాలు కుప్పల్లో ఉందని, 25 ఎకరాలు పనల్లో ఉందని తెలిపారు. తుపాను కారణంగా పెద్ద ఎత్తున గాలులు లేకపోవడం వల్ల కొయ్యని వరి పంట చెక్కు చెదరలేదని చెప్పారు.

బొబ్బిలిరూరల్: అపరాల సాగుపై రైతులకు అవగాహన ఉండాలని వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం రంగరాయపురం, పెంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబి పంటలో వేసే అపరాల పంట మీద పూర్తి అవగాహన ఉండాలన్నారు. కలుపు మందు వాడకపోవడం, పంటకి సకాలంలో నీటి తడులు, ఎరువులని అందించలేకపోవడం వల్ల దిగుబడులు చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. వీటిని అధిగమించడం కోసం రైతు విధిగా మూడు పద్ధతులను తూచా తప్పకుండా పాటించాలన్నారు. దీనిలో ప్రధానంగా మొక్క మూడు ఆకుల దశలో ఉండేటప్పుడు తప్పకుండా కలుపు నివారణ మందును వాడాలన్నారు. ఐదు నుంచి ఆరాకుల దశ ఉండేటప్పుడు ఎకరానికి ఐదు కేజీలు చొప్పున ట్యాంకు 500 గ్రాముల యూరియా కలిపి పిచికారి చేయాలన్నారు. ఎకరానికి 10 ట్యాంకులు, ఒక పురుగుమందు ఒక తెగులు మందుని పిచికారి చేసుకుంటే దిగుబడులు కనీసం ఒకటి నుండి రెండు క్వింటాళు పెరగడానికి ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం పక్కి, పిరిడి పిహెచ్‌సిల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ఆశాలకు వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించకపోతే సమ్మె చేపడతామన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ధరలు విపరీతంగా పెంచారని దానికి తగ్గట్టు ఆశా వర్కర్లకు కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి కార్మిక హక్కులను కాలరాస్తూ 44 లేబర్ చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి శ్రమజీవులు హక్కుల కాల రాస్తున్నారని అన్నారు. మొత్తం బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల కోసమే పని చేస్తుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్, కరెంటు, అన్ని రకాల భారాలు వేసి శ్రమజీవులను దోపిడీ చేసి కార్పొరేట్లకు దోచి పెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2025 ఫిబ్రవరిలో పెట్టే కేంద్ర బడ్జెట్లో ఆశా వర్కర్లు డిమాండ్స్‌ను పరిష్కరించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆశా వర్కర్ల సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పక్కిలో ఎల్లమ్మ, బి.పద్మ, నారాయణమ్మ, పిరిడిలో నాగమణి, రమణమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కలవరాయి స్వామి వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు డ్రగ్స్ వాడితే వాటి వల్ల వచ్చే అనర్థాలు, ప్రమాదాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించి ఫిర్యాదులు తెలియజేసే సంకల్పం డ్రాప్ బాక్స్‌ను కళాశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థులు డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడే వారి సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని యస్‌హెచ్‌ఒ కె.సతీష్ కుమార్ విద్యార్థులను కోరారు. కళాశాలలో యాంటి డ్రగ్స్ కమిటీని కూడా నియమించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్లు వినూత్న రీతిలో మోసాలు చేస్తున్నారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో డిజిటల్ అరెస్టులు పేరిట బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతున్నారని, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే దీనికి సంబంధించి ఒక టీం ఏర్పాటు చేసి వారి ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, స్థానిక ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు విలువ లేదా?

ప్రజాశక్తి - వేపాడ

గ్రామ పాలకవర్గ సభ్యుల ఆమోదం లేకుండా గత వైసిపి ప్రభుత్వం బొద్దాం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 105/2లో అదరాబాదరాగా జగనన్న గృహాలకు స్థలం మంజూరు చేశారని సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, ఉప సర్పంచ్ ఎస్ వెంకటరమణ, వార్డు మెంబర్లు ఎ.శ్రీను, వి.గౌరినాయుడు, వి.అంజలి, జె. మంగు నాయుడు, కె.సత్యనారాయణ, షేక్ బుడా తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడి మీద గతంలో పనిచేసిన తహశీల్దార్ పంచాయతీ ఆమోదం లేకుండా 16 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. దీన్ని పాలకవర్గ సభ్యులుగా తాము విభేదించడంతో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అప్పగించలేదన్నారు. ఈ మధ్యకాలంలో కోర్టు తమకు ఇంటి స్థలాలు కేటాయించిందని చెప్పుకుంటూ వారికి నచ్చిన విధంగా కొండను కూడా తవ్వి స్థలాలు ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. ఈ విషయం స్థానిక తహశీల్దార్ దృష్టికి తీసుకుని వెళ్ళగా తాను స్థలాలు అప్పగించలేదని చెప్పడంతో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను గుర్తించి పాలకవర్గం సభ్యుల ఆమోదం మేరకు వివాదాలు లేకుండా స్థలాలు అప్పగించాలని ఆదేశించారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలున్నప్పటికీ లబ్ధిదారులు వారికి నచ్చిన విధంగా కొండను జెసిబితో చదును చేస్తూ ఎవరైనా అడ్డువస్తే అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. రెవెన్యూ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై గ్రామంలో తగాదాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారుల స్పందించి గ్రామంలో పాలకవర్గం ఎదుట సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అలా చేయని ఎడల అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై తహశీల్దార్ రాములమ్మను వివరణ కోరగా.. ఈ స్థలాలను తన టైమ్‌లో మంజూరు చేయలేదని, తాను స్థలాలను అప్పగించలేదని, విఆర్ఒను పంపించి జెసిబితో పనులు చేయకుండా ఆపివేయాలని ఆదేశిస్తామన్నారు.

రిలీవ్ ఇవ్వకపోవడంతో సచివాలయ ఉద్యోగుల అసంతృప్తి

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలో సచివాలయం సిబ్బంది బదిలీలు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 22న కూటమి ప్రభుత్వం బదిలీలకు పచ్చ జెండా ఊపినా.. ఇక్కడ ఎంపిడిఒ మాత్రం ఎర్రజెండా ఊపుతూనే ఉన్నారు. కొంత మంది సచివాలయ ఉద్యోగులకు రిలీవింగ్ లెటర్ ఇవ్వకుండా నేటికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. బదిలీలకు సిద్ధంగా ఉన్న ఉద్యోగులు మాత్రం విధి నిర్వహణలో ఎంపిడిఒ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనరి బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించండి అని సచివాలయాలకు వెళ్లినా కొద్ది రోజుల్లో బదిలీ అవుతామని కొత్తగా వచ్చిన వారితో చేయించుకోండని బదిలీలలో ఉన్న ఉద్యోగులు సమాధానం చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో సచివాలయానికి వెళ్లిన వారికి పనులు జరగడంలేదు. బదిలీలు జరిగి సుమారు రెండు నెలలు కావస్తున్నా ఎంపిడిఒ నేటికి రిలీవింగ్ లెటర్ ఇవ్వడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పెండింగ్‌లోని ఉన్న బదిలీలను పూర్తి చేసి, ఇప్పటికై బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి వికలాంగుల క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు హాజరయ్యారు. వీరందరికీ క్రీడా పరికరాలు, టెక్నికల్ సపోర్ట్‌గా పీడీలు వ్యవహరించారు. అన్ని క్రీడల్లోనూ ప్రథమ ద్వితీయ స్థానాలను ఎంపిక చేసి ఈనెల 6న జరగబోయే జిల్లాస్థాయి కార్యక్రమంలో బహు మతులు అందజేయనున్నట్లు క్రీడా శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

పూసపాటిగ : వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంఇఒలు ఏ.రాజ్ కుమార్, బి. పాపినాయుడు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి శంకర్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి. నీలిమ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం వెంకటేశ్వరరావు, పి అప్పల నరసమ్మ, పలువురు తల్లిదండ్రులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక భవిత కేంద్రం, వల్లంపూడి ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురష్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్ రావు వికలాంగులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ ఎన్ సత్యవతి, సిహెచ్ జయంతి, ఎన్ విజయలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని అంబటివలస ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. వికలాంగ పిల్లలంతా ఉత్సాహంగా పాల్గొని అందరిని అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా ఎంఇఒ శోభారాణి మాట్లాడుతూ పిల్లలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకొని అన్ని రంగాల్లో రాణించాల న్నారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఇఒ అల్లు వెంకట రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ. ఆనంద, ఐఇడి టీచర్స్ గోపాలకృష్ణ, రామునాయుడు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. రోగు లకు టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, వైద్యులు రాజా రమేష్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి వికలా ంగుల సంఘం కార్యదర్శి సిహెచ్ రాంబాబు, సభ్యులు టి.హరిబాబు, టి.శ్రీనివాసరావు, డి.దుర్గాప్రసాద్, బి.త్రినాధ పాల్గొన్నారు.



విజయనగరం : క్రీడా పోటీల్లో పాల్గొన్న వికలాంగులు

శృంగవరపుకోట: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద గల భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బి.నరసింగరావు, పాదం గణపతిలక్ష్మి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం జగదీశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డి.సీతారామయ్య, ధర్మవరం హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు రహీం షేక్ లాల్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి లీలాకృష్ణ, రాయవరపు శ్రీనివాసరావు పాల్గొని వికలాంగ విద్యార్థులచే కేక్ కట్ చేయించారు. అనంతరం వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

డెంకాడ: మండలంలో గల భవిత ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఎంఇఒ శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాలు రాయితీలు, ఉపకరణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పినతడివాడలో ప్రాథమిక పాటశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన బహుమ తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పినతాడివాడ ప్రధానో పాధ్యాయుడు రాజశేఖర్, సిఆర్పిలు, పాల్గొన్నారు.

గుర్ల: విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాలలో ముందుండాలని జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసి నాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులదినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెల్లాన బంగారు నాయుడు, ఎంఇఒ భాను ప్రకాష్, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపిడిఒ శేషు బాబు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాం: వికలాంగుల ప్రతిభను గుర్తించినట్లయితే అన్నిటిలో రానిస్తారని ఎంఇఒ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిపి రెగ్యులర్ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలలో నెగ్గిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. కన్నమ్మ, ఎంపిటిసి బి. గోపి, జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లంనాయుడు, మాజీ జెడ్‌పిటిసి భాస్కరరాజు, సహిత విద్యా ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవికుమార్, ఆర్.శంకరరావు, భారతి, రాజినాయుడు, కళ్యాణి, చినప్పారావు, పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు కె. శివ కన్నబాబు, భవిత హెచ్ఎం రాకేష్, ఐఇఆర్‌టి బి. అప్పలనాయుడు, పురుషోత్తం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలలోని భవిత కేంద్రంలో ఎంపిపి ఉమా లక్ష్మి, సర్పంచ్ రూపవతి ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జె. త్రినాధరావు, హై స్కూల్ హెచ్ఎం, సహిత విద్య ఉపాధ్యాయులు జి.శంకర రావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామభద్రపురం: వికలాంగుల పట్ల సమాజంలో ఆదరణ పెరగాలని ఎంఇఒ తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఎంఇఒ-2 పెంటయ్యతో కలిసి నిర్వహించారు. అనంతరం వికలా ంగులు, వారి తల్లిదండ్రులు కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించి వివిధ క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమ తులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్పీ చింతల రాజేశ్వరి, తేజస్విని స్పెషల్ ఎడ్యుకేటర్ కళావతి పాల్గొన్నారు.